నేడు బిఆర్ఎస్ అభ్యర్థులకు బిఫారాలు

- బస్సు యాత్రకు ప్రణాళిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



మొన్నటి అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి దాదాపు మూణ్నెల్ల ముందే అభ్యర్థులను ప్రకటించి, అన్ని పార్టీల కంటే ముందే బిఫారాలను అందజేసిన బిఆర్ఎస్ అధినేత కెసిఆర్... ఈసారి కూడా అదే వ్యూహాన్ని అనుసరించబోతున్నారు. తద్వారా పార్టీ తరపున పోటీ చేయబోయే ఎంపీ అభ్యర్థుల్లో ఆయన జోష్‌ను నింపనున్నారు. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బిజెపిలకంటే ఒకడుగు ముందుకేసి అందరికంటే ముందుగానే బిఫారాలను అందజేయనుండటం గమనార్హం. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కాబోతున్న తరుణంలో సైతం అధికార కాంగ్రెస్ అభ్యర్థుల విషయంలో డైలమాలో ఉంది. ఇంకా మూడు స్థానాలకు ఆ పార్టీ అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. రాష్ట్రంలోని 17 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన బిజెపి... ఒకట్రెండు స్థానాల్లో వారిని మార్చేందుకు నానా తంటాలూ పడుతోంది. ఈ రెండు పార్టీల పరిస్థితి ఈ విధంగా ఉంటే... కెసిఆర్ మాత్రం గురువారం తన పార్టీ అభ్యర్థులకు ఏకంగా బిఫారాలనే అందజేయనుండటం గమనార్హం. ఇదే సమయంలో ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొనేందుకు వీలుగా తన రాష్ట్రవ్యాప్త పర్యటనల నిమిత్తం బస్సు యాత్రకు సంబంధించిన రూట్‌మ్యాప్‌ను, సంబంధిత ప్రణాళికను ఆయన విడుదల చేయనున్నారు.

గురువారం మధ్యాహ్నం 12 గంటల తర్వాత హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులు, లోక్‌సభ అభ్యర్థులతో భేటీ కానున్న ఆయన... ఎంపి ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలను, ప్రచారం చేయాల్సి తీరును వివరించనున్నారు. అధికార కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు ఎలా విడమరిచి చెప్పాలనే విషయమై ఆయన వారికి దిశా నిర్దేశం చేయనున్నారు. కాగా లోక్‌సభ ఎన్నికల టికెట్లు ఇచ్చిన తర్వాత కూడా పలువురు నేతలు బిఆర్ఎస్‌కు హ్యాండిచ్చిన సంగతి విదితమే. వీరిలో కడియం శ్రీహరి, గడ్డం రంజిత్ రెడ్డి, కే.కేశవరావు తదితర సీనియర్లు కూడా ఉన్నారు. వీరితోపాటు ఖైరతాబాద్, భద్రాచలం ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తెల్లం వెంకటరావు, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ తదితరులు కూడా పార్టీని వీడారు. హైదరాబాద్ నగరంలో కీలక నాయకుడైన మాజీ మంత్రి మల్లారెడ్డి లాంటి వారు సైతం సైలెంట్ అయ్యారు. ఈ నేపథ్యంలో కారు పార్టీలో నైరాశ్యం నెలకొంది. దీన్ని పోగొట్టి, క్యాడర్‌లో నూతనోత్సాహాన్ని నింపేందుకు కెసిఆర్ పలు వ్యూహాలు రచించారు. అందులో భాగంగానే నిన్నటి వరకూ ఎండిన పంట పొలాల పరిశీలన పేరుతో జిల్లాల్లో పర్యటించిన ఆయన... ఇప్పుడు అన్ని పార్టీల కంటే ముందుగా బీఫాంలను అందజేయడం ద్వారా నాయకులు, కార్యకర్తల్లో జోష్‌ను నింపేందుకు ప్రయత్నిస్తున్నారని బిఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాంటి ఫలితాన్నీ ఇవ్వని ఆయన వ్యూహం... మరి లోక్‌సభ ఎన్నికల్లో ఎలాంటి రిజల్ట్‌ను ఇవ్వబోతుందో చూడాలి.

జీవ నదుల చెంత.. నీటికి చింత

- కృష్ణ, బీమా నదుల ప్రవేశం దగ్గరే నీటి కోసం అవస్థలు
- ఎగువ ప్రాంతం పేరుతో పనులు జరగని మిషన్ భగీరథ
- తంగెడు, సుకూర్ లింగంపల్లి గ్రామాల దగ్గర కృష్ణా నీరు జిల్లాలోకి ప్రవేశం
- అయినా తాగునీటి కోసం వ్యవసాయ బోరు బావులే దిక్కు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న నదీ సమీప ప్రజలు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జీవనదులు ప్రవహిస్తున్నా.. ఆ పక్కనే గొంతు తడుపుకోవడానికి కూడా అల్లాడాల్సిన దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి.. సుదూర ప్రాంతాలలో పట్టణాలకు మిషన్‌భగీరథ ద్వారా తాగునీటిని అందిస్తున్న కృష్ణానది.. దాని పక్కనే ఉంటున్న వేలాది మంది ప్రజల గొంతు మాత్రం తడపడం లేదు. కృష్ణానది ఎగువ ప్రాంతం అయిన కర్ణాటక, మహారాష్ట్ర ప్రాజెక్టుల్లో సరిపడా నీళ్లు ఉన్నా.. దిగువ ప్రాంతాల ప్రజలు తాగునీటి కోసం కటకట ఆడాల్సిందే. వేల కోట్లు ఖర్చు చేసి తాగునీటి అవసరాలు తీర్చామని గత ప్రభుత్వం ఆర్భాటం చేసినప్పటికీ కూత వేటు దూరంలో ఉన్న కృష్ణానది పరివాహక ప్రాంత ప్రజలకు తాగునీరు అందివ్వలేకపోయిందన్న విమర్శ మూటగట్టుకుంది.

నారాయణపేట జిల్లా కృష్ణ మండల పరిధిలో తంగెడు గ్రామం సంగమం దగ్గర కృష్ణానది జిల్లాలో ప్రవేశిస్తుంది. అదే గ్రామంలో సుకూర్, లింగంపల్లి దగ్గర బీమా నది వచ్చి కృష్ణానదిలో చేరుతోంది. రెండు ప్రధాన నదులున్నా.. వేసవి వచ్చిందంటే ఇక్కడ తాగునీటికి ఘోస తప్పడం లేదు. గత పాలకులు మిషన్‌భగీరథ పథకం పేరుతో వేల కోట్లు ఖర్చు చేశారు. ప్రతి ఇంటికీ ఉచితంగా తాగునీటిని సరఫరా చేస్తామని చెప్పారు. ఎగువ ప్రాంతంలో ఉండటం వల్ల మోటార్లు ఎత్తుకు నీటిని అందివ్వలేవన్న కారణం చూపి మిషన్ భగీరథ పథకం ఇక్కడ అమలు కాలేదు. తాగునీటి సమస్య తీర్చడానికి ఈ ప్రాంతంలో లిఫ్టులు ఏర్పాటు చేశారు. తంగెడి, స్వయం భూలక్ష్మి వెంకటేశ్వర పేరుతో రెండు లిఫ్టులు, ముడిమాల్ లిఫ్టు, క్షీర లింగేశ్వర లిఫ్టులను ఏర్పాటు చేశారు. ఈ లిఫ్టుల ద్వారా వరదలు వచ్చే సమయంలోనే తాగునీటి సరఫరా చేస్తారు. వేసవిలో వరదలు ఆగి జలాలు వెనక్కి వెళ్లిపోతే.. ఇక్కడ చుక్క నీటి నిల్వ ఉండదు. శుకూర్‌లింగంపల్లి, అయినాపూర్, కూసుమర్తి, తంగెడి, కృష్ణ, ఇందూపూర్, ముడిమాల్, గుడెబల్లూరు గ్రామాల్లో వేసవిలో నీటి సమస్య తీవ్రంగా ఉంది.

బోరుబావులు, వ్యవసాయ బోర్లే ఆధారం..

కృష్ణ మండల పరిధిలో 40 వేల జనాభా ఉంటుంది. వ్యవసాయం ప్రధాన వృత్తిగా జీవించే వీరికి సాగునీరు లేదు.. తాగునీటికి సైతం కష్టంగా ఉంటుంది. భూగర్భ జలాలు పడిపోయి బోరు బావులు ఎండిపోతే తాగునీటి సమస్య మరింత తీవ్రంగా మారింది. రిజర్వాయర్లు లేకపోవడంతో సాగు భూములకు నీరు అందడం లేదు. తాగునీటి అవసరాల కోసమైనా రిజర్వాయరు ఏర్పాటు చేస్తే.. వేసవిలో తాగునీటి సమస్య తీరనుంది. కొండల మీద ఉన్న గ్రామాలకు తాగుసాగు నీరు ఇచ్చే టెక్నాలజీ ఉన్న కాలంలోనూ ఈ ప్రాంత ప్రజల సమస్య తీరడం లేదు.

ఎగువ ప్రాజెక్టుల వల్లే నీటి సమస్య

కర్ణాటక, మహారాష్ట్ర ప్రభుత్వాలు కృష్ణానది ఎగువన చెక్‌డ్యాంలు, బ్రిడ్జీలు కం బ్యారేజీల నిర్మాణం చేశాయి. వేసవి కాలంలో ప్రాజెక్టుల్లో నీరు నిల్వ చేసుకుంటున్నాయి. అందుకే వేసవిలో మనకు నీటి సమస్య ఏర్పడుతోంది. మనకు కూడా నీటి సమస్య రాకుండా ఉండాలంటే ఇక్కడ రిజర్వయర్‌లు నిర్మాణం చేసుకోవాలి. వరదలు వచ్చినప్పుడు నిల్వ చేసుకుంటే నీటి సమస్య తీరుతుంది. ఆ దిశగా ప్రభుత్వం పనిచేయాల్సి ఉంది.

తాగునీటి కోసం తండ్లాడుతున్నాం

మా భూములు వరదలు వస్తే మునుగుతాయి. కానీ ఎండాకాలం వస్తే తాగునీరు కూడా దొరకదు. కృష్ణా, బీమా నదులు రెండు కిలోమీటర్ల దూరాన ఉన్నా.. తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం. వేసవిలో బోరుబావులు, ట్యాంకర్ల నీటినే వాడాల్సి వస్తోంది. తాగునీటి సమస్య పరిష్కారం కోసం అధికారులు చర్యలు తీసుకోవాలి.

కున్సి వెంకటేష్, తంగెడి గ్రామం నారాయణపేట

మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయడం లేదు

నదికి రెండు వందల కిలోమీటర్ల దూరాన ఉన్న నగరాలకు నీటిని సరఫరా చేస్తున్నారు. రెండు కిలోమీటర్ల దూరాన ఉన్న కృష్ణ మండలంలో తాగునీటి సమస్య తీర్చడం లేదు. గత పాలకులు మిషన్‌భగీరథ పేరుతో హడావుడి చేసి అధికారంలోకి వచ్చారు. చిత్తశుద్ధి ఉంటే తాగునీటి సమస్య పరిష్కారం కష్టమేమీకాదు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం తాగునీటిపై చర్యలు తీసుకోవాలి.

వెంకట్‌రాంరెడ్డి గవినోళ్ల, సిపిఎం జిల్లా కార్యదర్శి

నీటి కొరత ఉంది.. సమస్య రాకుండా చూస్తున్నాం

కృష్ణ మండలంలో తాగునీటి ఎద్దడి ఉన్న మాట వాస్తవమే. ఈ ప్రాంతం ఎత్తున ఉండటంతో ఇక్కడికి మిషన్‌భగీరథ నీళ్లు రావడం లేదు. అయినా బోరు బావులు, వ్యవసాయ పంపు సెట్ల ద్వారా నీటిని అందజేస్తున్నాం. ప్రజలకు నీటి కొరత రాకుండా ప్రయత్నం చేస్తున్నాం.

ఎంపిడిఏ జానయ్య

డ్రగ్స్ విక్రయిస్తున్న ఇంజనీరింగ్ విద్యార్థులు అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్, మాదాపూర్‌లో డ్రగ్స్ విక్రయిస్తున్న ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులను ఎస్‌ఒటి పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేంద్రవరానికి చెందిన గుత్తుల శ్యామ్‌బాబు, కాటూరి సూర్యకుమార్‌లను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.4.2 లక్షల విలువ చేసే 28 గ్రాముల ఎండిఎంఎ, రెండు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

టార్గెట్ డిఎస్‌సి

- ఉపాధ్యాయ కొలువువైపు అభ్యర్థుల చూపు
- టెట్‌కు ఆదరణ అంతంతే...
- ఇప్పటి వరకు 2.51 లక్షల దరఖాస్తులు
- గతేడాది కంటే తగ్గిన అప్లికేషన్లు
- ఫీజు పెంచడమే కారణం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఉపాధ్యాయ అభ్యర్థుల లక్ష్యం జిల్లా సెలెక్షన్ కమిటీ (డిఎస్‌సి)పైనే ఉంది. ఉపాధ్యాయ కొలువు సాధించడంపైనే వారు దృష్టి కేంద్రీకరించారు. ఆ వైపుగానే వారు మొగ్గుచూపుతున్నారు. 2017 అక్టోబర్ 21న 8,792 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిఎస్‌పిఎస్‌సి) నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఆ పోస్టుల భర్తీ ప్రక్రియ ముగిసింది. ఆ తర్వాత ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్‌ను విడుదల చేయలేదు. రాష్ట్రంలో 5,089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జిల్లా స్థాయి నియామక కమిటీ (డిఎస్‌సి) నోటిఫికేషన్‌ను గతేడాది సెప్టెంబర్ ఆరో తేదీన బిఆర్ఎస్ ప్రభుత్వం విడుదల చేసింది. 1,77,502 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. డిసెంబర్ ఏడో తేదీన ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. గత ప్రభుత్వం ప్రకటించిన డిఎస్‌సి నోటిఫికేషన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం ఫిబ్రవరి 28న రద్దు చేసింది. 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డిఎస్‌సి నోటిఫికేషన్‌ను అదే నెల 29న విడుదల చేసింది. జూన్ 20 వరకు దరఖాస్తుల సమర్పణకు గడువు ఉంది. రాష్ట్రంలో మెగా డిఎస్‌సి రాత పరీక్షలు జులై 17 నుంచి 31 వరకు ఆన్‌లైన్‌లో జరుగుతాయి.

టెట్‌పై డిఎస్‌సి ప్రభావం

రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నోటిఫికేషన్‌ను మార్చి 14న పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతున్నది. టెట్ దరఖాస్తుల సమర్పణకు ఈ నెల 20 వరకు గడువున్నది. ఇప్పటి వరకు దరఖాస్తులపై ఆ ప్రభావం పడింది. టెట్ పేపర్-1కు 90,789 మంది, పేపర్-2కు 1,60,857 మంది కలిపి 2,51,646 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. గతం కంటే దరఖాస్తులు భారీగా తగ్గడం గమనార్హం. టెట్ దరఖాస్తు ఫీజు రూ.వెయ్యి చెల్లించాలని విద్యాశాఖ నిర్ణయించింది. వచ్చే నెల 20 నుంచి జూన్ మూడో తేదీ వరకు టెట్ రాత పరీక్షలను ఆన్‌లైన్‌లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సిబిటి) విధానంలో నిర్వహిస్తారు. ఆన్‌లైన్‌లో రాత పరీక్షల వల్ల దరఖాస్తు ఫీజు పెంచాల్సి వచ్చిందని అధికారులు చెప్తున్నారు.

ఆఫ్‌లైన్‌లో టెట్ నిర్వహించినపుడు దరఖాస్తు ఫీజు రెండు పేపర్లకు కలిపి రూ.400 ఉంది. ఇప్పుడు ఒక్కో పేపర్‌కు రూ.వెయ్యి చెల్లించాలని నిర్ణయించారు. ఫీజు తగ్గించాలంటూ అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థి, యువజన, ఉపాధ్యాయ సంఘాలు కూడా ఫీజు తగ్గించాలంటూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. అయినా ఎలాంటి మార్పు లేదు. టెట్ దరఖాస్తులు తగ్గడానికి ఫీజు పెరగడం కూడా ఓ కారణంగా ఉన్నది. టెట్ కాలపరిమితి జీవితకాలం ఉండడంతో ఎక్కువ మంది మార్కులు సంపాదించిన వారు దరఖాస్తు చేసేందుకు మొగ్గు చూపలేదు. మరోవైపు జులైలోనే డిఎస్‌సి రాత పరీక్షలు ఉన్నాయి. ఎక్కువ మంది ఉపాధ్యాయులు డిఎస్‌సి రాసేందుకే ఆసక్తి కనబరుస్తున్నారు. అందుకే టెట్ దరఖాస్తులు తగ్గాయి. గతేడాది సెప్టెంబర్ 15న నిర్వహించిన టెట్ పేపర్-1కు 2,69,557 మంది, పేపర్-2కు 2,08,498 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. గతేడాది కంటే పేపర్-1కు 1,78,768 పేపర్-2కు 47,641 దరఖాస్తులు తగ్గడం గమనార్హం. ఇంకోవైపు సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్‌జిటి) పోస్టులకు బిఎడ్ అభ్యర్థులు దరఖాస్తు చేసేందుకు అవకాశం లేదు. టెట్ దరఖాస్తులు తగ్గడానికి ఇదీ ఓ కారణంగా ఉన్నది.

ఉపాధ్యాయుల్లో ఇంకా గందరగోళమే...

ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయుల్లో టెట్‌పై ఇంకా గందరగోళం కొనసాగుతూనే ఉంది. పలు అంశాల్లో వివరణ ఇవ్వాలంటూ జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి (ఎన్‌సిటిఇ)ని పాఠశాల విద్యాశాఖ కోరింది. కానీ ఇంత వరకు వివరణ రాలేదు. దీంతో ఉపాధ్యాయులు టెట్ రాయాలా? వద్దా? అంటూ ఆందోళన చెందుతున్నారు. అయితే ఉపాధ్యాయుల కోసం ప్రత్యేకంగా టెట్ నిర్వహించే అవకాశం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. రాష్ట్రంలో 1.04 లక్షల మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. వారిలో నాలుగు వేల మంది గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు (జిహెచ్ఎం) ఉన్నారు. మిగిలిన లక్ష మందిలో సుమారు 30 వేల మంది ఉపాధ్యాయులు టెట్ ఉత్తీర్ణులయ్యారు. ఇంకా 70 వేల మంది ఉపాధ్యాయులు టెట్ ఉత్తీర్ణత కావాల్సి ఉంది. పదోన్నతి పొందాలంటే టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి ఎన్‌సిటిఇ స్పష్టం చేసింది. ఎన్‌సిటిఇ నుంచి వివరణ రాకపోవడంతో ఉపాధ్యాయులు టెట్ దరఖాస్తు చేయలేదని తెలుస్తున్నది.

మా 'సోషల్ మీడియా'పై వేధింపులు

- పునరావృతం కాకుండా చూడండి
- డిజిపికి బిఆర్ఎస్ ఫిర్యాదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్తలపై పోలీసులు వేధింపులకు పాల్పడుతున్నారని ఆ పార్టీ ఆరోపించింది. ఈ మేరకు బిఆర్ఎస్ నేతలు బుధవారం హైదరాబాద్‌లో డిజిపి రవి గుప్తాను కలిసి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ విధానాలను, పని తీరును ప్రశ్నించిన వారిపై అసహనంతో అక్రమ కేసులు పెడుతున్నారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. జగిత్యాల జిల్లాలో బిఆర్ఎస్‌కు చెందిన సల్వాజీ మాధవరావు అనే కార్యకర్త ధర్మపురి కాంగ్రెస్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టింగులు పెడుతున్నాడనే కారణంతో సొగాలి తిరుపతి అనే రౌడీషీటర్ ద్వారా హత్యాయత్నం చేయించారని తెలిపారు. నిందితులపై చర్యలు తీసుకోకుండా బాధితుడిపైనే ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు పెట్టి పోలీసులు వేధింపులకు గురిచేస్తున్నారని తెలిపారు. కింది స్థాయిలో కొంత మంది పోలీసు అధికారులు ప్రభుత్వానికి వంత పాడుతూ తమ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని వివరించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని వారు డిజిపికి విజ్ఞప్తి చేశారు.

ప్రజాస్వామ్య స్ఫూర్తికి గొడ్డలిపెట్టు

- కెసిఆర్ వ్యాఖ్యలపై బండి సుధాకర్‌గౌడ్ ఫైర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాటైనా ఉండదేమో అని మాజీ సిఎం కెసిఆర్ మాట్లాడడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి గొడ్డలి పెట్టు లాంటిదని టిపిసిసి అధికార ప్రతినిధి బండి సుధాకర్‌గౌడ్ పేర్కొన్నారు. పీకలోతుల్లోకి కుంభకోణాల్లో ఇరుక్కున్న ఆయన అసహనంతో సిఎం రేవంత్‌రెడ్డిపై పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడు తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేపదే బిజెపి బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందంటూ మాట్లాడడం తమ పార్టీ ఎమ్మెల్యేలను అవమానించడమే అవుతుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తక్షణమే బేషరతుగా తమ పార్టీ ఎమ్మెల్యేలకు బిఆర్ఎస్, బిజెపి నేతలు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌కు పూర్తి మోజార్టీ ఉందని, పదవులకు, డబ్బులకు, ప్రలోభాలకు ఆశపడే ఎమ్మెల్యేలు ఎవరూ తమ వద్ద లేరని తెలిపారు. పదేళ్లుగా అధికారంలో ఉన్న కెసిఆర్ ఏ ఒక్క రోజూ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేయలేదని విమర్శించారు. అలాంటప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అంబేద్కర్‌ను అవమానించిందంటూ ఆయన గగ్గోలు పెట్టడం విడ్డూరంగా ఉందని తెలిపారు. ఎన్నికల నిబంధనలు అమల్లో ఉన్న దృష్ట్యా ప్రభుత్వ ఆధ్వర్యంలో మహా నాయకుల జయంతి ఉత్సవాలను ప్రభుత్వం నిర్వహించలేకపోయిందని స్పష్టం చేశారు. సర్దార్ సర్వాయి పాపన్న, దొడ్డి కొమురయ్య, కొమురం భీమ్, అంబేద్కర్ వంటి మహనీయుల జయంతులు ఏప్రిల్‌లోనే ఉన్నాయని గుర్తు చేశారు. వాటిని కూడా ఎన్నికల కోడ్ దృష్ట్యా ప్రభుత్వం నిర్వహించ లేకపోయిందని తెలిపారు. భద్రాచలంలో శ్రీ రాములవారి కళ్యాణ మహోత్సవానికి కూడా ఎన్నికల కోడ్ రావడంతో రాష్ట్ర ప్రభుత్వం తరపున సిఎం వెళ్లలేకపోయారని పేర్కొన్నారు. కెసిఆర్ వాస్తవాలను వక్రీకరించి తెలంగాణ సమాజాన్ని తప్పుదోవ పట్టించే విధంగా మాట్లాడటం సరైందికాదని గుర్తు చేశారు.

రాగల మూడు రోజులు గరిష్ట ఉష్ణోగ్రతలు

వాతావరణ శాఖ వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో రాగల 3 రోజులు గరిష్ఠ ఉష్ణోగ్రతలు రెండు నుంచి మూడు డిగ్రీల వరకు పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. బుధ, గురు, శుక్రవారాల్లో కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ వడగాల్పులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ఇవాళ మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో, గురువారం... కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల్లో వడగాల్పులు వీస్తాయని వెల్లడించింది. ఈ జిల్లాలకు వాతావరణ శాఖ మూడు రోజుల పాటు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.

కొన్ని జిల్లాలకు మోస్తరు వర్ష సూచన

ద్రోణి.. దక్షిణ విదర్భ నుంచి మరట్వాడ, ఉత్తర అంతర్గత కర్ణాటక నుంచి దక్షిణ అంతర్గత కర్ణాటక వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కి. మీ ఎత్తులో కొనసాగుతోందని తెలిపింది. మరో ద్రోణి.. మన్నార్ గల్ఫ్ నుంచి అంతర్గత తమిళనాడు, రాయలసీమ మీదుగా దక్షిణ తెలంగాణ వరకు సగటు సముద్ర మట్టానికి 1.5 కి. మీ ఎత్తులో కొనసాగుతోందని పేర్కొంది. వీటి ప్రభావంతో బుధ, గురు, శుక్రవారాల్లో కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

కమనీయం... భద్రాద్రి రామయ్య కల్యాణం

- ప్రభుత్వం తరపున సిఎస్ లాంఛనాలు
- నేడు పట్టాభిషేక మహోత్సవం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



భద్రాద్రిలో శ్రీరామనవమి వేడుకలు శోభయమానంగా కొనసాగుతున్నాయి. భద్రాచల పుణ్యక్షేత్రంలో శ్రీ సీతారాముల కల్యాణోత్సవం బుధవారం కన్నుల పండువగా జరిగింది. పట్టాభిషేక మహోత్సవాన్ని గురువారం నిర్వహిస్తారు. అభిజిత్ లగ్న మూహూర్త సమయాన సీతమ్మ మెడలో రామయ్య తాళి కట్టడంతో కల్యాణ క్రతువు పూర్తయింది. మిథులా స్టేడియంలోని మండపంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ వైభవంగా నిర్వహించారు. ఉదయం రామాలయంలో మూలవరులకు మొదట కల్యాణం జరిగింది. ఆపై ఉత్సవమూర్తులను ఆలయం నుంచి మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా మిథులా కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. సీతారాముల కల్యాణోత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకులు నిర్వహించారు. ఉదయం 10:30 గంటలకు కల్యాణోత్సవం ప్రారంభం కాగా.. అభిజిత్ లగ్నంలో సీతారామయ్యలకు రుత్వికులు జీలకర్ర బెల్లం పెట్టారు. ఆపై సీతమ్మ మెడలో రామయ్య మాంగళ్యధారణ గావించారు. తరువాత భక్తులు గోటితో వలసిన తలంబ్రాలను సీతారాముల శిరస్సుపై పోశారు. తదనంతర కార్యక్రమాలను అర్చకులు సంప్రదాయబద్ధంగా పూర్తి చేశారు.

ప్రభుత్వం తరపున సీఎస్ పట్టువస్త్రాల సమర్పణ

లోక్‌సభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో సీతారాములకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి పట్టువస్త్రాలను సమర్పించారు. కల్యాణోత్సవానికి డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క దంపతులు, రెవెన్యూ శాఖ పొంగులేటి శ్రీనివాస రెడ్డి దంపతులు, మంత్రి కొండా సురేఖ, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు దంపతులు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ దంపతులు హాజరయ్యారు. అలాగే సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పిఎస్ నర్సింహ, హైకోర్టు జడ్జి భీమపాక నగేష్ కల్యాణంలో పాల్గొన్నారు. రామయ్య కల్యాణాన్ని కనులారా వీక్షించేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

మిథులా స్టేడియం.. సర్వాంగ సుందరం..

సీతారామచంద్రుల కళ్యాణం కోసం మిథిలా కల్యాణ మండపంలో 24 సెక్టార్లు ఏర్పాటు చేశారు. 31 వేల మందికి పైగా భక్తులు కల్యాణం వీక్షించారు. 1800 మంది పోలీసులు బందోబస్తు విధుల్లో ఉన్నారు. కల్యాణోత్సవం సందర్భంగా మిథులా స్టేడియాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఈ వేడుక కోసం ఆలయాన్ని అందంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణం మొత్తం విద్యుత్ దీపాలతో మిరమిట్లు గొలుపుతోంది. శ్రీ రామ పట్టాభిషేకం గురువారం ఉదయం నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు. భద్రాద్రి జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా, ఎస్‌పి రోహిత్ రాజ్, ఇఒ రమాదేవి క్రతువుల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

వైట్ పెట్రోలియం జెల్లీ తయారీ

- జ్వరానికి మందులంటూ తప్పుడు ప్రచారం
- డిసిఎ దాడుల్లో వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో డ్రగ్ కంట్రోల్ అధికారుల దాడులు కొనసాగుతున్నాయి. కల్తీ మందులు లేని రాష్ట్రమే తమ లక్ష్యమంటూ కొన్ని నెలలుగా నిర్వహిస్తున్న దాడుల్లో ప్రతి రోజు రాష్ట్రంలో ఏదో ఒకచోట చట్టవిరుద్ధ కార్యకలాపాలు వెలుగు చూస్తున్నాయి. కుత్బుల్లాపూర్‌పేట్ బషీర్‌బాద్‌లోని ఓ మెడికల్ షాప్‌పై దాడి చేయగా ప్యూర్‌లైన్ పేరుతో వైట్ పెట్రోలియం జెల్లీని అమ్ముతున్నట్టు బయటపడింది. దీంతో లేబర్ లేకుండా దీన్ని తయారు చేస్తున్న హైదరాబాద్ శివరాంపల్లిలోని జూబిలెంట్ కాస్మోస్యూటికల్స్‌పై దాడి చేసి నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. జ్వరం తగ్గిస్తుందంటూ తప్పుడు ప్రచారంతో అమ్ముతున్న అల్టాకోస్డ్ సస్పెన్షన్ మందును రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం అత్తాపూర్ మెడికల్ షాపులో కనుగొన్నారు. దీన్ని హిమాచల్‌ప్రదేశ్ సిర్మోర్ కాలా అంబ్‌లో కండౌర్ ఫార్మాస్యూటికల్స్ తయారు చేస్తుండగా.. బెంగుళూరుకు చెందిన అట్లావిస్టా హెల్త్ కేర్ ప్రయివేట్ లిమిటెడ్ మార్కెటింగ్ చేస్తుంది. అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా డ్రగ్ కంట్రోల్ అథారిటీ డైరెక్టర్ జనరల్ వివి.కమలాసన్ రెడ్డి తెలిపారు.

భువనగిరి గడ్డపై ఎర్రజెండా ఎగరాలి


- ప్రధాని మోడీ పెద్ద మోసగాడు
- స్థాయి దిగజార్చుకుంటున్న కెసిఆర్
- సిపిఎం అభ్యర్థి ఎండి జహంగీర్ రేపు నామినేషన్ దాఖలు
- పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పోరాటాల గడ్డ నుంచి ఎర్రజెండా ముద్దుబిడ్డ సిపిఎం ఎంపి అభ్యర్థి ఎండి జహంగీర్‌ను పార్లమెంట్‌కు పంపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోడీ పెద్ద మోసగాడు అని, మూడోసారి గెలిస్తే దేశాన్ని నాశనం చేస్తారని అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లా నకిరేకల్ పట్టణ కేంద్రంలోని నర్రా రాఘవరెడ్డి భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బిజెపి ఎన్నికల ముందు ప్రకటించిన మ్యానిఫెస్టోకు, అధికారంలోకి వచ్చిన తర్వాత అనుసరిస్తున్న విధానాలకు సంబంధం లేదన్నారు. పదేళ్లలో మోడీ ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ కార్పొరేట్ కంపెనీలకు అప్పగించారని విమర్శించారు. ఎన్నికల ముందు ప్రజలను మభ్యపెట్టి ఓట్లు వేయించుకొని అధికారంలోకొచ్చాక విస్మరిస్తారన్నారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిజెపిలో చేరుతారని ప్రకటించడం సరైంది కాదన్నారు. రేవంత్ రెడ్డి బిజెపిలో చేరుతారని ప్రధాని నరేంద్ర మోడీ, అమిత్ షా ఏమైనా చెప్పారా.. చెబితే ప్రజలకు వివరించాలన్నారు. అర్థంపర్థం లేని విమర్శలు చేసి తమ స్థాయిని దిగజార్చుకుంటున్నారన్నారు.

ఎంతో పోరాట చరిత్ర కలిగిన భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో అవకాశవాదులను ఓడించి.. ప్రజల గొంతుకగా ఉన్న సిపిఎం అభ్యర్థి జహంగీర్‌ను పార్లమెంటుకు పంపించాలని కోరారు. విద్యార్థి దశ నుండే జహంగీర్ కమ్యూనిస్టు ఉద్యమంలో పనిచేస్తున్నారన్నారు. మూసీ ప్రక్షాళన పోరాటం, కార్మిక, కర్షక వర్గాల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేశారన్నారు. పేదలకు, రైతులకు, ప్రజలకు ఎర్రజెండా ద్వారానే న్యాయం జరుగుతుందన్నారు. ప్రజలందరూ ఆలోచించి ఉద్యమ చరిత్ర కలిగిన కమ్యూనిస్టు అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ నెల 19న జహంగీర్ నామినేషన్ కార్యక్రమం భువనగిరిలో ఉంటుందని తెలిపారు ఈ కార్యక్రమానికి పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు హాజరుకానున్నట్టు తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. కమ్యూనిస్టుల పోరాట వారసత్వాన్ని కొనసాగించేందుకు పార్లమెంటు ఎన్నికల్లో భువనగిరి ఎంపీ అభ్యర్థి ఎండి.జహంగీర్‌ను గెలిపించాలని కోరారు. సిపిఎం అభ్యర్థిని పార్లమెంటుకు పంపిస్తే భువనగిరి నియోజకవర్గ పరిధిలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో బిజెపికి ఓటు వేయొద్దన్నారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందాల ప్రమీల, నాయకులు బొజ్జ చిన్న వెంకులు, రాచకొండ వెంకట్‌గౌడ్, వంటిపాక వెంకటేశ్వర్లు, సిహెచ్ లూర్దు మారయ్య, ఒంటెపాక కృష్ణ, చెన్నబోయిన నాగమణి, ఏర్పుల రాజేశ్వర్ పాల్గొన్నారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి


శ్రీనివాస గుప్తకు పార్టీ కండువా కప్పుతున్న రోహిత్ చౌదరి తదితరులు

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి

- ఎఐసిసి జనరల్ సెక్రెటరీ రోహిత్ చౌదరి
- కాంగ్రెస్‌లో చేరిన ఉప్పల శ్రీనివాస గుప్త

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి రోహిత్ చౌదరి అన్నారు. రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్, ఇంటర్నేషనల్ ఆర్యవైశ్య ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఉప్పల ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఉప్పల శ్రీనివాస గుప్త బుధవారం గాంధీభవన్‌లో కాంగ్రెస్‌లో చేరారు. అంతకుముందు ఆయన నాగోల్ డివిజన్‌లోని తన నివాసం నుంచి అభిమానులతో కలిసి ర్యాలీగా గాంధీభవన్‌కు చేరుకున్నారు. రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్రెడ్డి రామిరెడ్డి, తెలంగాణ పిసిసి ప్రధాన కార్యదర్శి కుమార్ రావుల ఆధ్వర్యంలో ఆయన కాంగ్రెస్‌లో చేరారు. శ్రీనివాస గుప్తకు రోహిత్ చౌదరి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రోహిత్ చౌదరి మాట్లాడుతూ.. ఉప్పల శ్రీనివాస గుప్తకు కాంగ్రెస్ మంచి అవకాశాలు కల్పిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలు అమలు పరిచిన ఘనత ఒక్క కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. తెలంగాణలో 14 పార్లమెంట్ స్థానాల్లో విజయకేతనం ఎగుర వేస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయమని, కేంద్రంలో ఈ దఫా ఇందిరమ్మ పాలన రానుందని చెప్పారు. ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల పథకాల అమలు వల్లే కాంగ్రెస్‌లో చేరినట్టు చెప్పారు. రాష్ట్రంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయడం పట్ల సిఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ స్థాయిలో ఆర్యవైశ్యులను ఏకం చేసి, వారికి మేలు చేసేలా సోనియాగాంధీ, రాహుల్ గాంధీకి విన్నవిస్తామని తెలిపారు. తెలంగాణ యూత్ వైశ్య ఫెడరేషన్ అధ్యక్షుడు కట్టా రవికుమార్, ఐవీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పబ్బా చంద్రశేఖర్, కటకం శ్రీనివాస్, నరేష్ గుప్తా, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సాంబు పాండు గుప్తా, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చింతల రజనీకాంత్, 33 జిల్లాల వైశ్య నాయకులు, ఉప్పల యువసేన నాయకులు, బిసి, మైనార్టీ నాయకులు మహ్మద్, బాషా, ఆసీఫ్ సహా దాదాపు మూడు వందల మందికి పైగా కాంగ్రెస్ గూటికి చేరారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలంగాణ టూరిజం అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, సీనియర్ నాయకులు రామ్‌మోహన్ గౌడ్, కాంగ్రెస్ నాగోల్ డివిజన్ అధ్యక్షులు మంజులా రెడ్డి పాల్గొన్నారు.

జువైనల్ హోం నుంచి 8 మంది చిన్నారులు జంప్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జువైనల్ హోం నుంచి ఎనిమిది మంది పిల్లలు తప్పించుకున్న ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సూరారం పోలీస్ స్టేషన్ పరిధి కైసర్‌నగర్‌లో జరిగింది. వివరాల్లోకెళ్తే.. మంగళవారం రాత్రి జువైనల్ హెూం తరగతి గది కిటికీ గ్రిల్స్‌ను తొలగించి ఓ బాలుడు పారిపోయాడు. అనంతరం మరో ఏడుగురు అలాగే పారిపోయారు. దాంతో బుధవారం ఉదయం హోం నిర్వాహకులు సూరారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. చుట్టుపక్కల సిసిటివి కెమెరాల ఆధారంగా పిల్లలు ఎటు వైపు వెళ్లింది తెలుసుకునే పనిలో ఉన్నారు. పారిపోయిన చిన్నారులు సయ్యద్ మైరాజ్ ఎ మెహ్రాజ్, షేక్ రెహాన్, సయ్యద్ ఆజం, సయ్యద్ సోహైల్, షేక్ అబ్దుల్ హక్‌పే ఇమ్రాన్, మొహమ్మద్ రెహాన్, మొహమ్మద్ హకీమ్, మొహమ్మద్ మహబూబ్ అని పోలీసులు తెలిపారు.

కెసిఆర్.. నీ పార్టీని మూడు నెలల్లో బొంద పెడతాం

- కాంగ్రెస్‌ను టచ్ చేస్తే బిఆర్‌ఎస్ పునాదులు ఉండవు
- కవిత జైలుకుపోయినా మీకు బుద్ధి రాలేదా?
- ధైర్యం లేకనే అసెంబ్లీకి దూరం
- ఎంపి ఎన్నికల్లో 14 సీట్లు మావే..
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'కెసిఆర్ నిన్ను.. నీ పార్టీని మూడు నెలల్లో రాజకీయంగా బొంద పెడతాం. కాంగ్రెస్‌ను టచ్ చేస్తే బిఆర్‌ఎస్‌కు పునాదులు వుండవు. కుమార్తె కవిత జైలుకుపోయినా మీకు ఇంకా బుద్ధి రాలేదా' అని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని తన క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కెసిఆర్ ఫోన్ ట్యాపింగ్ చేయించి.. ఇంట్లో భార్యాభర్తలు మాట్లాడుకునేవి కూడా విని దేశంలో ఎక్కడ లేని దరిద్రమైన పాలన చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికైన ప్రభుత్వాన్ని ఏడాదిలో ఎలా పడగొడతావు? దోపిడీ దొంగవై మా ఎమ్మెల్యేలను కొనాలనుకుంటున్నావా అని ప్రశ్నించారు. తాము తలుచుకుంటే మీ బంధువులు ముగ్గురు, నలుగురు తప్ప ఎవరూ బిఆర్‌ఎస్‌లో ఉండరని అన్నారు. "నువ్వు ఓ పాస్‌పోర్ట్ దొంగవు. నువ్వు సిఎం కాగా లేనిది.. కష్టపడి సిఎం పదవిని అలంకరించిన రేవంత్ రెడ్డికి నీకు పోలికా.. రేవంత్ రెడ్డికి మొఖం చూపించలేక రెండు సార్లు అసెంబ్లీ సమావేశాలు అయినా నువ్వు రాలేదు. నీ కొడుకు, నీ అల్లుడు తీహార్ జైలుకు వెళ్లడం ఖాయం" అని అన్నారు. కేసీఆర్‌ను చూస్తే జాలేస్తుందన్నారు. తాము తలచుకుంటే 30 మంది బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో ఎప్పుడో చేరేవారని అన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఒక్క ఎంపి సీటు కూడా బిఆర్‌ఎస్‌కు రాదన్నారు. కాంగ్రెస్ పార్టీకి 13 నుంచి 14 ఎంపి సీట్లు రావడం ఖాయమని, జూన్ ఐదు నుంచి ప్రభుత్వ పాలనపై దృష్టి పెడతామన్నారు.

శ్రీరామనవమి సందర్భంగా భద్రాద్రిలో ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిశాక ప్రతి నియోజకవర్గానికీ 3500 ఇళ్లు ఇస్తామన్నారు. 10 సంవత్సరాల కాలంలో ఒక్క ఇల్లైనా కట్టించావా, ఒక్క రేషన్ కార్డు అయినా మంజూరు చేశావా.. అసలు పేదల కోసం ఏం చేశావని కేసీఆర్‌ను ప్రశ్నించారు. విటమిన్ డీ తీసుకొని దొంగ దీక్షలు చేసి చావు నోట్లో తల పెట్టి ఉద్యమం చేశానని చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. అవినీతి చేసిన కెసిఆర్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కవిత జైలుకు పోయాక కేసీఆర్ మానసిక స్థితి దెబ్బతిన్నదని, రేవంత్ బిజెపిలోకి పోతున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని కుట్రలు చేసినా పసిగట్టుతాం.. మీ కుటుంబానికి సరిపోయే డబుల్ బెడ్ రూమ్ ఇల్లు చర్లపల్లి జైల్లో కట్టిస్తామని చెప్పారు. తింటానికి తిండి లేని జగదీశ్ రెడ్డి వేల కోట్లు ఎలా సంపాదించాడో చెప్పాలన్నారు.

ఎస్ఎల్బీసీ సొరంగాన్ని ఏఎమ్మార్పీ, బ్రాహ్మణ వెల్లెంల పనులు రూ.3000 కోట్లతో నడుస్తున్నాయని, ఆగస్టులోపు కాలువలు కూడా తీసి అదనంగా సొరంగాన్ని పూర్తిచేసి నీటి సమస్యకు పరిష్కారం చూపబోతున్నామని చెప్పారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీకి కట్టుబడి ఉన్నామన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ వంగూరు లక్ష్మయ్య, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు గుమ్ముల మోహన్ రెడ్డి తదితరులు ఉన్నారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

మాదాపూర్‌లో 'ఆరంభం' స్టోర్ ఏర్పాటు

- ప్రారంభించిన సినీ నటి రకుల్ ప్రీత్



హైదరాబాద్ : నగరంలోని మాదాపూర్‌లో బాలీవుడ్ నటి రకుల్ ప్రీత్ సింగ్ తొలిసారిగా తన సొంత డైన్‌ఇన్ రెస్టారెంట్ 'ఆరంభం' స్టోర్‌ను ప్రారంభించారు. ఫిట్‌నెస్‌కు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చే రకుల్ ప్రీత్ ఆరంభం కోసం బ్రాండ్ అంబాసిడర్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. 'ఆరంభం-స్టార్ట్స్ విత్ మిల్లెట్" అనేది భారతదేశంలోని ప్రముఖ ఫుడ్ అండ్ బెవరేజెస్ సంస్థ, క్లౌడ్ కిచెన్ ఆపరేటర్ క్యూర్ ఫుడ్స్ భాగస్వామ్యంతో దీన్ని అందుబాటులోకి తెచ్చారు. 'నేను హైదరాబాద్‌లో నా తొలి మిల్లెట్ ఆధారిత రెస్టారెంటును ప్రారంభిస్తున్నందుకు ఎంతో ఉద్విగ్నంగా ఉంది. మా ప్రత్యేకమైన, కాలానుగుణ మెనూ చిరుధాన్యాల ఆధారిత వంటకాలతోనే రూపొందింది. రుచిలో రాజీపడకుండా ఆరోగ్యకరమైన ఆహారానికి ప్రాధాన్యం ఇస్తుంది' అని రకుల్ ప్రీత్ సింగ్ పేర్కొన్నారు. ఆరంభం అనేది కేవలం ఒక రెస్టారెంటు మాత్రమే కాదని, ఆరోగ్యకరమైన జీవనశైలి ఉత్పత్తులకు తాము కట్టుబడి ఉన్నామని క్యూర్‌ఫుడ్స్ వ్యవస్థాపకులు అంకిత్ నాగోరి పేర్కొన్నారు.

బిజెపి, కాంగ్రెస్ మాటల గారడీ

- బిఆర్‌ఎస్ కరీంనగర్ ఎంపి అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిజెపి, కాంగ్రెస్ పార్టీలు మాటల గారడీతో ప్రజలను మాయచేస్తున్నాయని బిఆర్‌ఎస్ కరీంనగర్ ఎంపి అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014 ఎన్నికల సమయంలో బిజెపి చేసిన వాగ్దానాలు అమలుకు నోచుకోలేదన్నారు. ఎన్నికల సమయంలో అవినీతి సొమ్మును స్విస్ బ్యాంకు నుంచి తెస్తామని, ఒక్కొక్కరికి రూ.15 లక్షలు ఇస్తామని చెప్పి పదేండ్లు అయినా ఇవ్వలేదన్నారు. రైతులు పండించిన పంటకు స్వామినాథన్ సిఫారసు ప్రకారం ధర అమలు చేయడం లేదన్నారు. గోదావరి, కృష్ణా నదులపై కట్టిన ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇవ్వడం లేదని తెలిపారు. తెలంగాణలోని కొత్త జిల్లాల్లో నవోదయ పాఠశాలల ఏర్పాటు కోసం బిజెపి ఎంపిలు మాట్లాడలేదన్నారు. కరీంనగర్ ఎంపి బండి సంజయ్ ఐదేళ్లలో ఐదు రూపాయల పని చేయలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో 150 మెడికల్ కళాశాలలు ఇస్తే తెలంగాణకు ఒక్క మెడికల్ కాలేజీ ఇవ్వలేదని తెలిపారు. తెలంగాణలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేసిందన్నారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వ పథకాలకు ఇస్తున్న నిధులను.. బండి సంజయ్ ఇచ్చినట్టు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం మాయమాటలతో మోసం చేసిందని, రైతు భరోసా రూ.15 వేలు, కల్యాణలక్ష్మి లక్షతోపాటు తులం బంగారం, పెన్షన్ రూ.4 వేలు, మహాలక్ష్మి రూ.2500 ఇస్తామని, అబద్దాల పునాదిపైన అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పుడు ఆగస్టులో చేస్తామని చెప్పడం ఏంటని ప్రశ్నించారు. ఈ సమావేశంలో నాఫ్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఎంపిపి వంగ కరుణ, బిఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామి, సెస్ డైరెక్టర్ నారాయణరావు, వెంకట్ యాదవ్, లతారెడ్డి, దయాకర్‌రావు, లక్ష్మణ్, నాగరాజు, రాజు, శ్రీకాంత్‌రెడ్డి, మహబూబ్ అలీ, స్వామి, వాహిద్, రమేష్ ఉన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న వినోద్‌కుమార్


సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న కెటిఆర్

ఊరు బాగుంటే దేశం బాగుంటుంది

- సీతారాముల కల్యాణోత్సవంలో కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేవాలయం బాగుంటే ఊరు బాగుంటుందని, ఊరు బాగుంటే దేశం బాగుంటుందని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కెటిఆర్ అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లిలోని ప్రముఖ, ప్రాచీన రామాలయంలో బుధవారం జరిగిన సీతారామచంద్ర స్వామి కల్యాణ మహోత్సవంలో కెటిఆర్ పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 439 ఏళ్ల చరిత్ర గల ఈ రామాలయాన్ని ఇంత అత్యద్భుతంగా గ్రామస్తుల సహకారంతో పున:నిర్మించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును అభినందిస్తున్నట్టు తెలిపారు. దేవాలయాలను కాపాడుకుని భావితరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీలు నవీన్ కుమార్, శంభీపూర్ రాజు, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.


ర్యాంకు సాధించిన అభ్యర్థులను సన్మానిస్తున్న నిర్వాహకులు

విజన్ ఐఎఎస్ విద్యార్థులకు యుపిఎస్సి ర్యాంకులు

ప్రజాశక్తి - హైదరాబాద్

నగరంలోని విజన్ ఐఎఎస్ కోచింగ్ సెంటర్‌లోని ఇద్దరు విద్యార్థులకు యుపిఎస్‌సిలో రెండు ర్యాంక్‌లు దక్కాయి. ఉదయకృష్ణ రెడ్డి ఆల్ ఇండియా -780 ర్యాంక్, కేసరపు మీనా 899వ ర్యాంక్‌ను సాధించారని ఆ సంస్థ పేర్కొంది. మీడియా సమావేశంలో కృష్ణరెడ్డి మాట్లాడుతూ.. ప్రకాశం జిల్లాకు చెందిన తాను 2013 నుంచి 2018 వరకు కానిస్టేబుల్‌గా పని చేశానని తెలిపారు. ఆ తర్వాత ఉద్యోగానికి రాజీనామా చేసి యుపిఎస్‌సికి సన్నద్ధం అయ్యాయని తెలిపారు. నాలుగో ప్రయత్నంలో ర్యాంకు సాధించానని తెలిపారు. మీనా మాట్లాడుతూ.. మూడో ప్రయత్నంలో ర్యాంక్ సాధించానని అన్నారు. యుపిఎస్‌సి ర్యాంక్‌లు పొందిన తమ విద్యార్థులను విజన్ ఐఎఎస్ నిర్వాహకులు సత్కరించారు.

భారీ విస్తరణపై ఎంజి మోటార్ దృష్టి

న్యూఢిల్లీ : తృతీయ, నాలుగో శ్రేణీ నగరాలపై కీలక దృష్టి కేంద్రీకరిస్తున్నట్లు ఎంజి మోటార్ ఇండియా తెలిపింది. 2025 మార్చి నాటికి 270 నగరాల్లో 520 టచ్‌పాయింట్లకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది. ఈ ఏడాది ముగింపు నాటికి కొత్తగా 100 టచ్ పాయింట్లను ఏర్పాటు చేయాలని నిర్దేశించుకున్నామని ఎంజి మోటార్ ఇండియా చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ సతిందర్ సింగ్ బజ్వా తెలిపారు. ప్రతీ డీలర్‌షిప్‌లోనూ తమ అన్ని కొత్త మోడళ్లు ఉండేలా చూస్తామన్నారు. తమ తదుపరి జర్నీ ఎంజి 2.0 పట్ల చాలా ఆసక్తిగా ఉన్నామన్నారు. ప్రస్తుతం ఏడాదికి లక్ష యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉన్నామని.. దీన్ని 3 లక్షలకు చేర్చాలని నిర్దేశించుకున్నామన్నారు. ఎంజి మోటార్ ఇటీవలే జెఎస్‌డబ్లును సంయుక్త భాగస్వామిగా ఎంచుకుంది.



రాగల మూడు రోజులు గరిష్ట ఉష్ణోగ్రతలు

- వాతావరణ శాఖ వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో రాగల 3 రోజులు గరిష్ఠ ఉష్ణోగ్రతలు రెండు నుంచి మూడు డిగ్రీల వరకు పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. బుధ, గురు, శుక్రవారాల్లో కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ వడగాల్పులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ఇవాళ మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో, గురువారం... కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల్లో వడగాల్పులు వీస్తాయని వెల్లడించింది. ఈ జిల్లాలకు వాతావరణ శాఖ మూడు రోజుల పాటు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.

కొన్ని జిల్లాలకు మోస్తరు వర్ష సూచన...

ద్రోణి.. దక్షిణ విదర్భ నుంచి మరట్వాడ, ఉత్తర అంతర్గత కర్ణాటక నుంచి దక్షిణ అంతర్గత కర్ణాటక వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కి. మీ ఎత్తులో కొనసాగుతోందని తెలిపింది. మరో ద్రోణి.. మన్నార్ గల్ఫ్ నుంచి అంతర్గత తమిళనాడు, రాయలసీమ మీదుగా దక్షిణ తెలంగాణ వరకు సగటు సముద్ర మట్టానికి 1.5 కి. మీ ఎత్తులో కొనసాగుతోందని పేర్కొంది. వీటి ప్రభావంతో బుధ, గురు, శుక్రవారాల్లో కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

పంటను కాపాడుకునేందుకు రైతు భగీరథ ప్రయత్నం

- ఇబ్బడిముబ్బడి వేస్తున్న బోర్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రోజురోజుకు భూగర్భ జలాలు పడిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇందులో బాగానే ఆరుగాలం శ్రమించి సాగు చేసుకున్న పంటను కాపాడుకునేందుకు రైతులు అడుగడుగునా బోర్లు వేయిస్తున్నారు. ఒక్కొక్క బోర్‌కు సుమారు లక్ష రూపాయల వరకు ఖర్చవుతోంది. అయినా పంట దక్కుతుందనే నమ్మకం లేదు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రాంతంలో కొండపోచమ్మ, మల్లన్న సాగర్ ప్రాజెక్టులు ఉన్నప్పటికీ ఈ ఏడాది నీటి సరఫరా తక్కువగా ఉండటంతో నీటిని పొదుపుగా వదులుతుండటంతో పంట పొలాలకు సాగునీరు అందడం లేదు. దాంతో రైతులు చాలావరకు బోర్లు వేయించు కుంటున్నారు. ఒక్కొక్క రైతు 2,3 బోర్లు వేయించినా చుక్క నీరు రావడం లేదని ఆవేదన చెందుతున్నారు. భూగర్భ జలమట్టాలు పడిపోకుండా ఉండడానికి ప్రభుత్వం వాల్టా చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ నిబంధనల ప్రకారం అనుమతి లేనిదే ఇసుక తీయడం, బోర్లు తవ్వడం చేయకూడదు. ఒకవేళ తప్పని పరిస్థితి వస్తే బోరు బావికి కనీసం 100 మీటర్ల దూరంలో మాత్రమే కొత్త బోరు వేయాలని నిబంధ నలున్నాయి. కానీ రైతు తన పొలాన్ని దక్కించుకునేందుకు దూరం పాటించడం లేదు. పక్క పక్కకే పొలాలు ఉండటంతో తన పొలం ఎక్కడ ఎండిపోతుందోనని ఆందోళన చెందుతున్నారు. గట్టుకి అటు ఇటు వైపు రైతులు బోరు వేసుకుంటున్నారు.

మరో పక్క ఇండ్ల నిర్మాణం యజమానులూ ఇష్టం వచ్చినట్టు ఇంటి నిర్మాణం వద్ద బోరు బావులు తవ్వడం ప్రారంభించారు. జిల్లాలో పరిస్థితి చూస్తే వాల్టా చట్టం ఉందా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఎందుకంటే వాగుల్లో ఇసుక తీయటం ఆగటం లేదు. విచ్చలవిడిగా బోర్లు తవ్వకం నిలవడం లేదు. పంటలు ఎండిపోతున్నాయనే కారణంగా రైతులు మరింత లోతుకు బోర్లు వేస్తున్నారు. ఇళ్ల నిర్మాణాల కోసం యజమానులు, వెంచర్లు, స్థిరాస్తి వ్యాపారం చేసేందుకు రియల్టర్లు ఇష్టారీతిన బోర్లు తవ్వుతున్నారు. జిల్లాలో రోజుకు సుమారు పాతిక వరకు బోర్లు వేస్తున్నట్టు సమాచారం. ఇసుక తీయటం, బోర్లు వేయటం కారణంగా వాతావరణ సమతుల్యం దెబ్బతిని ఆనర్థాలకు దారి తీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ రబీలో దాదాపు మూడు లక్షల ఎకరాల మేర వరి పంట సాగైంది. ప్రస్తుతం వరి పంట గొలుసు కట్టి గింజ పాలు తాగుతోంది. ఈ దశలో అధికంగా నీటి అవసరం ఉండటంతో భూగర్భనీటి మట్టం తగ్గిపోయి చాలా చోట్ల వేసిన బోర్లు పూర్తిగా ఎండిపోవడంతో రైతులు మళ్లీ కొత్తగా బోరు బావులు తవ్వుతున్నారు. కొన్నిచోట్ల పాత వాటి మరింత లోతుకు తవ్విస్తున్నారు. జనాల సంఖ్య భారీగా పెరిగి సిద్దిపేట జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్-ప్రజ్ఞాపూర్, హుస్నాబాద్, దుబ్బాక, చేర్యాల మున్సిపాల్టీల్లోని మండల కేంద్రాల్లో జోరుగా ఇళ్ల నిర్మాణాలు సాగుతున్నాయి. ప్రతి ఇంటికి కొత్తగా బోరు వేసిన తరువాతనే పనులు ప్రారంభిస్తున్నారు. వెంచర్లు ఏర్పాటు చేస్తున్న రియల్టర్లు రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణంతోపాట వెంచర్లలో అభివృద్ధి పనుల కోసం బోరు తవ్విస్తున్నారు. ఫలితంగా జిల్లాలో బోర్ల సంఖ్య భారీగా పెరిగిపోతోంది. ఇండ్లలోని బోర్లు పరిశీలిస్తే మున్సిపల్ పరిధిలో లక్షకు పైగా వినియోగిస్తున్నట్టు అధికారులు అంచనా వేశారు. దీనికి తోడు నెలకు సుమారు 150 వరకు కొత్త బోర్లు వేస్తున్నట్టు తెలుస్తోంది. ఇలా ఇష్టారీతిన బోర్లు వేయటం వల్ల రానున్న రోజుల్లో మరింత ఇబ్బందులు ఎదురవుతాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. కాగా పంట కాపాడుకోవడానికి బోరులు తవ్వడం తప్పడం లేదని రైతులు స్పష్టం చేస్తున్నారు. .

